క్లుప్తంగా

120 మందికి ఉచిత వైద్యసేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బంగారయ్య

ఎస్.రాయవరం : పేద ప్రజలకు సేవ చేయడంలో ఉండే సంతృప్తి మరెందులోనూ దొరకదని కెజిహెచ్ మాజీ ఆర్ఎంవో, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బంగారయ్య అన్నారు. అడ్డురోడ్డు ప్రజావైద్యశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరయిన రోగులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు.

2 న మండల పరిషత్ సమావేశం

పాయకరావుపేట : వచ్చే నెల 2వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. నవంబరు 2వ తేదీన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ ఆవరణలో గల స్త్రీ శక్తి భవనంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలన్నారు.

జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా


పండ్ల లోడ్‌తో బోల్తా పడిన కంటైనర్

పాయకరావుపేట : పట్టణంలో గల లింగాలకాలనీ సమీపాన గల జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కంటైనర్ బోల్తా పడింది. రాజమండ్రి నుండి విశాఖపట్నం వైపు వెళ్తున్న దానిమ్మ, కమలా ఫలాల లోడుతో వెళ్తున్న కంటైనర్ సడన్‌గా బ్రేక్ వేయడం కారణంగా బోల్తా పడింది. దీనివల్ల ఎవరికీ ప్రమాదం జరగలేదు. సుమారు 2 గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్టు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు.

ప్రజా ప్రణాళిక బస్సు యాత్ర గోడ పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం (అనకాపల్లి): ప్రజా ప్రణాళిక బస్సు యాత్ర గోడ పోస్టర్‌ను సీపీఎం నాయకులు ఆదివారం అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేటలో ఆవిష్కరించారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు సీపీఎం నాయకులు ఆర్.రాము, కర్రి అప్పారావు, కె.సోమునాయుడులు తెలిపారు. ఎస్.రాము నాయుడు, రామ్‌కుమార్, అప్పారావు, బుద్ధ రంగారావు పాల్గొన్నారు.

తొలగించిన వృక్షం.. మరో చోట నాటింపు


చెక్కు చెదరకుండా వృక్షాన్ని మరో స్థలంలో నాటేందుకు తీసుకొస్తున్న పొక్లెయిన్

అనకాపల్లిటౌన్ : ఒకపక్క అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూనే అటు పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. స్థానిక జాతీయ రహదారి సుంకరమెట్ట జంక్షన్ రహదారి విస్తరణ చకచకా జరుగుతోంది. రహదారి నిర్మాణ పనులకు అడ్డంకిగా మారిన 8 పెద్ద వృక్షాలను జేసీబీ సహాయంతో వేళ్లతో తీల్చి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మరలా నాటి వాటి పరిరక్షణకు ప్రభుత్వం పాటు పడుతోంది.

పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు

అనకాపల్లిటౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై ఈనెల 31వ తేదీ వరకూ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరట్ల నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరజీవి జీవిత చరిత్రపై క్లుప్తంగా ఎ-4 సైజ్ పేపరుపై రెండు పేజీలు రాసిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.116, ద్వితీయ, తృతీయ బహుమతులుగా కానుకలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాటిపల్లిలో అభివృద్ధి పరుగులు

- గత టీడీపీ హయాంలో కానరాని అభివృద్ధి
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కృషితో పూర్తి మౌలిక వసతుల కల్పన


పాటిపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన రహదారి

మునగపాక : గత టీడీపీ హయాంలో ఆ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది, ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండేది. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు లేక పోవడంతో ప్రజలు అవస్థలు పడేవారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడంతో ఆ గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించబడుతున్నాయి. కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు దర్శనమిస్తున్నాయి. ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు ఈ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తున్నారు. నేడు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన గ్రామంగా పాటిపల్లి గుర్తింపు పొందుతుంది.

కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు

పాటిపల్లి గ్రామంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.కోటితో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అలాగే రాకపోకలు సాగించేందుకు వీలుగా 12 ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. ప్రజా పరిపాలన అందుబాటులో ఉండేలా సచివాలయం, అలాగే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి భవన నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే రైతుల సౌకర్యార్థం ఆర్‌బీకేను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు వేగవంతమవుతున్నాయి. రూ.కోటి 50లక్షల వ్యయంతో పాటిపల్లి నుంచి రాజుపేటకు రహదారి సదుపాయం అందుబాటులోకి వస్తుంది. పాటిపల్లి శివారు గ్రామాలకు కూడా రహదారి సదుపాయం కల్పించారు.


పాటిపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం


రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కృషితో...

ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రత్యేక కృషితో పాటిపల్లి పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తుంది. గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం తగు చర్యలు తీసుకుంది.

ఆదర్శంగా తీర్చిదిద్దాం



పాటిపల్లి పంచాయతీని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా పాటుపడుతున్నాం. గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో ఎటువంటి సదుపాయాలకు నోచుకోలేని పాటిపల్లి నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రగతి పథంలో పయనిస్తోంది.

– ఆడారి కృష్ణవేణి, సర్పంచ్, పాటిపల్లి

రహదారులపై ప్రత్యేక దృష్టి



పాటిపల్లి గ్రామంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. మునుపెన్నడూ లేని విధంగా గ్రామంలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రహదారుల నిర్మాణాలపై దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, పలు రహదారులను ప్రారంభించాం. రానున్న రోజుల్లో గ్రామానికి అవసరమయ్యే అభివృద్ధి పనుల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

– మునిశేఖర్, పంచాయతీ రాజ్ డీఈ

అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో భిక్ష సదుపాయం

మునగపాక : మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష సదుపాయం ఆదివారం నాటికి 5 వరోజుకు చేరుకుంది. అయ్యప్ప మాలలు ధరించిన భక్తులతో పాటు ఇతర భక్తులు కూడా మధ్యాహ్నం సమయంలో భిక్ష చేసేందుకు వీలుగా కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు. మునగపాకతో పాటు ఇతర ప్రాంతాల్లో మాలలు ధరించిన భక్తులు ఇక్కడి భిక్ష సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. 50 రోజుల పాటు భిక్ష అందించేందుకు నిర్వాహకులు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ భిక్ష కోసం గ్రామస్తులు విరాళాలు అందిస్తుండడం విశేషం.


మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో భిక్ష సదుపాయం

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు

అనకాపల్లిటౌన్ : ధర్మప్రచార వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయని నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న ప్రారంభమైన వారోత్సవాలు వారం రోజుల పాటు నేత్రపర్వంగా జరిగాయని చెప్పారు. ఈ వారం రోజులు శ్రీ మరిడి మహాలక్ష్మి భజన బృందంచే బైబో భజన, అమృత వర్షిణి బృందంచే కోలాటం, శ్రీగౌరీలలితా ప్రార్థనా మండలిచే పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయన్నారు. వారోత్సవాలకు సహకరించిన పలు భక్తి బృందాలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, పలు బృందాల సభ్యులు పాల్గొన్నారు.


వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న కొణతాల మురళీకృష్ణ

విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ సమావేశం

నర్సీపట్నం: విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం నర్సీపట్నం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ ద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించుకున్నారు. యూనియన్ బలోపేతానికి కలసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని యూనియన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న కోటవురట్ల మండలం, పాములవాక పట్టాలమ్మతల్లి ఆలయం వద్ద వనసమారాధన ఏర్పాటు చేసేందుకు తీర్మానించామన్నారు. యూనియన్‌కు తగు సూచనలు, సహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్న సంఘ సీనియర్ సభ్యుడు వెదురువాడ రామగణేశ్వరరావును యూనియన్ ప్రతినిధులు విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పీబీఎం మోహన్, సాంబశివరావు, కోశాధికారి ఆదినారాయణ శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు.


రామగణేశ్వరరావును సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఢిల్లీ పయనమైన జిల్లా బీజేపీ నేతలు

అనకాపల్లిటౌన్ : నా భూమి నాదేశం మూడో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా బీజేపీ నేతలు ఢిల్లీకి ఆదివారం పయనమయ్యారు. స్థానిక రైల్వేస్టేషన్ బయట ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు 31 మండలాల నుంచి సేకరించిన మట్టి కలశాలతో ఢిల్లీకి చేరుకుంటామన్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ద్వారా విజయవాడ చేరుకుని అక్కడి నుంచి పార్టీ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు ద్వారా ఢిల్లీకి చేరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి వెంకట సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కర్రి రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

ఘనంగా ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో ఆదివారం ఉమా కోటి లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యదర్శి, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి జాజుల రమేష్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, బయ్యవరం సర్పంచ్ గొల్లవిల్లి జయ, కన్నూరుపాలెం సర్పంచ్ ఎస్. శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దెపల్లి శ్రీనివాసరావు, గొంతిన శివ ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుశ్శాలువలు కప్పి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు సత్కరించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. బంగారయ్యపేటకు చెందిన బృందం భజన కార్యక్రమం నిర్వహించింది.


ఉమా కోటిలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న కొణతాల మురళీకృష్ణ

నేడు దార్లపూడిలో జగనన్న సురక్ష

ఎస్.రాయవరం : దార్లపూడి సచివాలయం 2 పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. సచివాయల సిబ్బంది, గ్రామ వలంటీర్లు సకాలంలో కార్యక్రమానికి హాజరై రోగులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఇందులో ఇద్దరు ప్రత్యేక వైద్య నిపుణులు, ఇద్దరు సాధారణ వైద్యులతో కంటి పరీక్షల నిర్వహణ ఉంటాయన్నారు.

31న మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్ : నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా నర్సీపట్నంలో ఎంఎల్ఏఎస్ కళాశాలలో ఈనెల 31న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుని 18 నుంచి 25 సంవత్సరాలు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మర్ని వివరాలకు 7036363272 నంబరులో సంప్రదించాలని కోరారు.

సందడిగా 'చదవడం మాకిష్టం'

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు జోక్‌లు, కథలు వినిపించారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


గ్యారేజీ గేటు వద్ద నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లిటౌన్ : కావలి ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడికి నిరసనగా స్థానిక ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) గ్యారేజీ గేటు వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్, ఏపీపీటీడీ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ప్యాసింజర్లపై 14 మంది దాడికి పాల్పడిన ఘటన ఘోరమైందని అభివర్ణించారు. ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు బిక్కుబాబు, జిల్లా కార్యదర్శి డీఎస్ మూర్తి, డిపో సహాయ కార్యదర్శి వైవీఎస్ కుమార్, పీఎస్‌వీపీ రావు, ఏవీఎస్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసారు. ఎ.కోడూరు, ఎ.భీమవరం, గొండుపాలెం తదితర గ్రామాల్లో గల మండపాలు, ఆలయ ప్రాంగణాల్లో గౌరీపరమేశ్వరులను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలను జరిపారు. ఏటా విజయదశమి పర్వదినం తర్వాత వచ్చే పౌర్ణమి నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను జరపడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు పంట పొలాల్లో నుంచి వరి దుబ్బుల్ని తీసుకొచ్చి, గౌరమ్మగా కొలుస్తారు. శనివారం గౌరమ్మను తలపై పెట్టుకుని ఊరంతా ఊరేగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజైన ఆదివారం గౌరీ నందీశ్వరులను పల్లకిలో ఉంచి ఊరంతా ఊగించారు. యువత ఉత్సాహంగా పల్లకిని మోశారు. ప్రతి ఇంటి ముంగిటా స్వామికి ఘనంగా హారతులిచ్చి, పూజలు చేశారు.


గౌరీపరమేశ్వరులను పల్లకిలో ఊరేగిస్తున్న యువకులు

సంక్షేమ రారాజు సీఎం జగన్

సీఎం జగన్ చిత్రపటానికి దర్జీల క్షీరాభిషేకం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టైలర్లు

యలమంచిలి : సంక్షేమ పథకాల రారాజు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఉత్తరాంధ్ర టైలర్స్ వేదిక వ్యవస్థాపకుడు అతికినిశెట్టి సత్యనారాయణ అన్నారు. యలమంచిలి పట్టణంలో దర్జీల సంఘ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టైలర్స్ సంక్షేమం కోసం జగనన్న చేదోడు పథకం ద్వారా సంవత్సరానికి రూ.10 వేలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారని అందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర టైలర్స్ సంఘం అధ్వర్యంలో కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు టైలర్స్ కోసం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టైలరింగ్ వృత్తికి గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్న స్కూల్ యూనిఫార్మ్‌లు కుట్టే అవకాశం స్థానిక టైలర్లకే కల్పించాలని, 50 ఏళ్లు దాటిన దర్జీలకు పింఛను సదుపాయం కల్పించాలని, 200 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా షాపులకు అందజేయాలని కోరారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ బోదెపు గోవింద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతుందని, రాష్ట్రానికి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, సొసైటీ కార్యదర్శి డి.శేషుబాబు, మళ్ల శ్రీనివాస్, కారుకొండ భద్రరావు, వద్దిపర్తి సత్యనారాయణ, గిడుతూరి అప్పారావు, రైవాడ శంకరరావు, వేగి విజయ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడిగా ఎన్నికైన ధర్మారావు


ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సునీల్

ఎస్.రాయవరం : మండలంలో ఏపీటీఎఫ్ మండలశాఖ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. నారాయణపట్నం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం సభ్యులు సమావేశమై ఈ ఎన్నిక జరిపారు. జిల్లా ఉపాధ్యాయ సంఘ నాయకుడు ఎస్.ఫాల్గుణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్ ధర్మారావు ఎంపిక కాగా, ప్రధాన కార్యదర్శిగా జి.సునీల్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కె.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కె.తాతారావు, పి.నానాజీ, పి.అనంతలక్ష్మి, కార్యదర్శులుగా ఎస్.సత్యనారాయణ, విద్యాధర్, జి.లలిత, డి.రమేష్, జిల్లా కౌన్సిలర్లుగా ఇ.గోవిందరావు, పి.ప్రసాద్, కె.వి.రావు, వై.శ్రీనివాసరావు, ఎండి సాదిక్, కె.శ్రీనివాసరావు, డి.ఎ.ఎస్.మూర్తి, కె.రాజు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కనకారావు, కె.సన్యాసప్పడు, కె.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు జగదీష్, కె.నానాజీ, వి.శ్రీనివాస్, వి.గంగరాజు, సీహెచ్ అప్పలరాజు, బి.రమణ అప్పారావు, ఎ.అనంత లక్ష్మి, టి.ఉమాదేవి, జి.కృష్ణమోహన్, పి.శ్యామల, బి.శ్రీనివాసరావు, వి.అప్పలరెడ్డి, రామ్మోహనరావు, టి.రామకృష్ణ ఎంపికయ్యారు. రెండవ దఫా అధ్యక్ష కార్యదర్శులుగా ధర్మారావు, సునీల్ ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రజా రక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలి

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జరగనున్న ప్రజా రక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.వి. శ్రీనివాసరావు కోరారు. మునగపాకలో ఆదివారం ఆయన ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బీజేపీ పాలనలో కార్మిక, రైతు, సామాన్య ప్రజలు సతమతమవుతున్నారన్నారు. అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా గుర్తించాలన్నారు. ప్రజారక్షణ భేరి యాత్ర ముగింపులో భాగంగా నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, ఈ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి టెక్కలి జగ్గారావు, సీపీఎం నాయకులు బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ, లోవేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.


ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు

18న హలో మాదిగ.. చలో హైదరాబాద్

అనకాపల్లిటౌన్ : హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నవంబర్ 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కట్టమూరి మంగరాజు తెలిపారు. గవరపాలెం అరుంధతీనగర్ సంఘం కార్యాలయంలో ఆదివారం చలో హైదరాబాద్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరాలని ఆయన కోరారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా విచ్చేయచున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెట్ల నాయుడు, కొల్లి చిన్నఅప్పారావు, చేవ్వేటి అప్పారావు, పరదేశినాయుడు, ఈశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న మంగరాజు

మోదకొండమ్మ ఆలయంలో వీధి పండగల సందడి


పూలు, నగలతో మాడుగుల మోదకొండమ్మకు అలంకరణ


అమ్మవారి దర్శనానికి ఘటాలను శిరస్సున పెట్టుకుని బారులు తీరిన భక్తులు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భారీ స్థాయిలో వీధి పండగలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వందలాది మంది అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను శిరసున పెట్టుకుని కాలినడకన ఆలయానికి చేరుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వీధి పండగలతో పాటు అధిక సంఖ్యలో సాధారణ భక్తులు కూడా ఆలయానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి కిలో మీటరు మేర భక్తులు క్యూ లైన్లో నిరీక్షించారు. అమ్మవారి మండపంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. ఉచిత ప్రసాద వితరణ జరిపారు.